సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



అప్పు చేసి.. పప్పుకూడు ఎన్నాళ్లు?
మధ్యాహ్న భోజన పథకం నిధులకు గ్రహణం పట్టింది. బిల్లులు రాక పథకం నిర్వాహకులు అప్పుల పాలవుతున్నారు.
IIలో ▸



విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు!
నూజివీడు ట్రిపుల్‌ఐటీలో గణితం, ఇంగ్లిష్ బోధనకు ఈసీఈ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్లను కేటాయించడం విమర్శలకు తావిస్తోంది.
IIలో ▸



బాణసంచా.. తస్మాత్ జాగ్రత్త!
బాణసంచా దుకాణాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ విస్తృత ప్రచారం చేస్తోంది.
IIలో ▸

మందు బిళ్లలకు కోత

జిల్లాలోని ఒక ఆస్పత్రికి రోజుకు దాదాపు 400 వరకు ఓపీ నమోదవుతుంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ నెలలకు మొదటి క్వార్టర్‌గా మందుల కోసం వైద్యారోగ్యశాఖ సుమారు రూ.10.5 లక్షలు, సర్జికల్స్‌కు రూ.3.3 లక్షలు బడ్జెట్ ఇచ్చింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరుకు రెండో క్వార్టర్‌గా మందుల కోసం రూ.11.42 లక్షలు, సర్జికల్స్‌కు రూ.3.8 లక్షలు ఇచ్చింది. అక్టోబరు, నవంబరు, డిసెంబరుకు సంబంధించి ప్రస్తుత క్వార్టర్‌కు మందులకు రూ.8.5 లక్షలు, సర్జికల్స్‌కు రూ.2.42 లక్షలు మాత్రమే బడ్జెట్ ఇచ్చింది. రెండో క్వార్టర్‌తో పోలిస్తే మూడో క్వార్టర్ బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయి. జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో దాదాపు ఇదే పరిస్థితి.

ఏ మాత్రం శ్రద్ధ లేదు
- ప్రమాదంలో ప్రజారోగ్యం
- ప్రభుత్వాస్పత్రులపై కూటమి నిర్లక్ష్యం
- మందులు, సర్జికల్ సామగ్రి బడ్జెట్ తగ్గింపు
- 20 నుంచి 30 శాతం మేర కోత
- రోగులకు తప్పని ఇక్కట్లు



భీమవరంలో ఏరియా ఆస్పత్రి



సాక్షి, భీమవరం: జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, మూడు సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 34 వరకు పీహెచ్‌సీలు, 18 యూపీహెచ్‌సీలు వరకు ఉన్నాయి. రోజుకు 15,500 వరకు ఓపీ నమోదవుతుంది. సాధారణంగా యూనివర్సల్ (యూ), సబ్ డివిజనల్ (ఎస్), టెరిసరీ (టీ) కేటగిరీల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు మందుల కేటాయింపు చేస్తుంటారు. రోజువారీ ఓపీ, పెర్‌ఫార్మెన్స్ ఆధారంగా ప్రతి మూడు నెలలకు క్వార్టర్ ప్రాతిపదికన మందులు, సర్జికల్ పరికరాల కొనుగోలుకు వైద్యారోగ్య శాఖ బడ్జెట్ మంజూరు చేస్తుంది. ఆస్పత్రి స్థాయిని బట్టి మందుల కోసం అర్బన్ పీహెచ్‌సీలకు రూ.90 వేల నుంచి రూ.1.5 లక్షలు, రూరల్ పీహెచ్‌సీలకు రూ.1.75 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు, సీహెచ్‌సీలకు సుమారు రూ.15 లక్షల వరకు, ఏరియా ఆస్పత్రులకు రూ.20 లక్షల వరకు, అలాగే సర్జికల్ సామగ్రికి నిధులను కేటాయిస్తారు. ఈ నిధులతో మూడు నెలల కాలానికి గాను ఆస్పత్రికి అవసరమైన మందులు, శస్త్రచికిత్సల పరికరాలను సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచి వైద్య సిబ్బంది తెచ్చుకోవాలి.

బడ్జెట్‌లో కోత.. రోగులకు వెత

గతంతో పోలిస్తే మందులు, సర్జికల్స్‌కు సంబంధించి ప్రస్తుత క్వార్టర్‌కు బడ్జెట్ కేటాయింపులు తగ్గినట్టుగా తెలుస్తోంది. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు యథావిధిగా కేటాయింపులు చేసినా సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులకు కోత పడింది. తణుకులోని జిల్లా ఆస్పత్రితో పాటు భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెంలో ఏరియా ఆస్పత్రులు, ఆకివీడు, పెనుగొండ, ఆచంటలోని సీహెచ్‌సీలకు రోజువారీ ఓపీ అధికంగా ఉంటుంది. ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందే వారూ ఎక్కువే. ఆయా ఆస్పత్రులకు మూడో క్వార్టర్ బడ్జెట్‌లో 20 నుంచి 30 శాతం వరకు కోత పెట్టినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఆయా ఆస్పత్రులకు మందులు తగ్గి రోగులు ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొద్దినెలల క్రితం బీపీ అదుపులో ఉంచే ఎటన్‌లాల్ 50, నొప్పులు తగ్గేందుకు వినియోగించే ప్రియాబ్లిన్ టాబ్లెట్లు, రోగికి సత్తువనిచ్చే మెట్రోజిల్ సెలైన్లు తదితర రకాల మందులు సరిపడా సరఫరా లేక రోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. అవసరమైన డ్రగ్స్‌తో ఇండెంట్ పెడుతున్నా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్‌లో కొన్నిరకాల మందులు అందుబాటులో లేక రోగులు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచేందుకు వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది లేదు

మందులకు కొరత లేదని, అవసరమైన మందులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. గత బడ్జెట్‌లో మిగిలి ఉన్న స్టాకు, రోజువారీ ఓపీ, మందుల వినియోగాన్ని బట్టి క్వార్టర్ బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ తెలిపారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ నిధుల నుంచి మందుల కొనుగోలు చేసుకునేందుకు వెసులుబాటు ఇచ్చినట్టు వివరించారు.

న్యూస్‌రీల్

ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్మికుల నిరసన

భీమవరం: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శివరామ్, రాజారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు వినే నాథుడే కరువయ్యాడన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వేధింపులు పెరిగాయని, వేతన బకాయిలు, పని ఒత్తిడి బాగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. టెండర్‌తో నిమిత్తం లేకుండా ఉద్యోగాలు కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా టెండర్ల పేరుతో డబ్బులు వసూలు చేయడం మానుకోలేదని ఆరోపించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛభారత్, క్లీన్ అండ్ గ్రీన్ వంటి పేర్లు పెట్టి ప్రజాప్రతినిధులు ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప పరిశుభ్రతను కాపాడే వారి పరిస్థితిని పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం కొత్తగా చెబుతున్న స్వర్ణ పంచాయతీల్లో సీనియార్టీని బట్టి పంచాయతీ కార్మికులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు కిరణ్, రాజబాబు, మల్లుల ఏసుబాబు, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఐఐఏ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఉప్పునీటి సాంద్రత కలిగిన ప్రాంతంలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా సీఐఐఏ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లో రిజిస్ట్రేషన్‌పై సమీక్షించారు. దేశంలోనే పశ్చిమగోదావరి జిల్లాను ఎంపిక చేసి బ్రాకిష్ వాటర్ క్లస్టర్ కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీనివలన కేంద్ర ప్రభుత్వం సీఐఏఏ కింద మంజూరు చేసే ప్రయోజనాలను పొందడానికి వీలవుతుందని తెలిపారు. జిల్లాలో 17,100 ఎకరాలు బ్రాకిష్ వాటర్ ఆక్వా సాగులో ఉందని, ఈ పరిధిలో రైతులు నెలాఖరులోపు రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలన్నారు. మొగల్తూరు మండలంలో ఐదు, నరసాపురం మండలంలో ఆరు, యలమంచిలి, భీమవరం మండలాల్లో రెండేసి చొప్పున రెవెన్యూ గ్రామాలు ఈ పరిధిలో ఉన్నాయన్నారు. సముద్ర తీరానికి రెండు కిలోమీటర్లు, ఉప్పునీటి సాగు కాలువలకు రెండు వందల మీటర్ల దూ రంలో సాగు చేసేవి మాత్రమే బ్రాకిష్ వాటర్ సాగు పరిధిలోకి వస్తాయన్నారు. జిల్లాలో ఫ్రెష్ వాటర్ కింద 1,32,503.91 ఎకరాల్లో ఆక్వా సాగు విస్తీర్ణం ఉందని, ఇప్పటివరకు 56,881.8 ఎకరాల విస్తీర్ణంలోని రైతులు అప్పడా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన వారూ పూర్తిచేసుకోవాలన్నారు. డీఆర్వో బి.శివ న్నారాయణ రెడ్డి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ అయ్యా నాగరాజా, ఏడీ ప్రసాద్, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్, రైతులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం కేసులో సిట్ దర్యాప్తు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో సంచలనంగా మారిన కల్తీ మద్యం వ్యవహారంలో సిట్ అధికారులు ఏలూరులోని ఒక మద్యం వ్యాపారిని విచారించారు. కల్తీ మద్యం కుంభకోణంలో కీలక పాత్రధారి జనార్దన్‌కు ఏలూరులోని వ్యక్తికి మద్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఏలూరుకు చెందిన వ్యక్తిని విచారించినట్టు సిట్ అధికారులు చెబుతున్నారు. గతంలో ఇద్దరి మధ్య జరిగిన వ్యాపార లావాదేవీల్లో భాగంగానే డబ్బులు ఇచ్చినట్లు, ప్రస్తుతం అలాంటి ఆర్థిక లావాదేవీలేమీ జరగలేదని అధికారులకు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

బీచ్ వద్ద పటిష్ట ఏర్పాట్లు



పేరుపాలెంలో కార్తీకమాస ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: కార్తీకమాసంలో వన సమారాధనలనకు కేపీపాలెం–పేరుపాలెం సాగర తీరాలకు వచ్చే సందర్శకులకు బీచ్ వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. గురువారం పేరుపాలెం బీచ్ గెస్ట్ హౌస్ వద్ద అధికారులతో సమీక్షించారు. కార్తీకమాసంలో పుణ్యస్నానాలు చేసేందుకు లక్షలాది మంది యాత్రికులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదుల నిర్మాణంతో పాటు సముద్రంలో స్నానానికి దిగిన వారికి ప్రాణనష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్‌కు వచ్చే మూడు మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడటంతో పాటు వాహనాలు పార్కింగ్‌కు అవసరమయ్యే స్థలాన్ని గుర్తించాలన్నారు. ప్రత్యేకంగా శని, ఆదివారం రోజుల్లో పెద్దఎత్తున సందర్శకులు వస్తారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. నిర్దేశించిన ప్రదేశం దాటి సముద్ర స్నానం చేసేవారిని తక్షణమే ఒడ్డుకు తీసుకువచ్చేందుకు గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన పనులను వివరించారు. సర్పంచ్‌లు తిరుమాని విజయలక్ష్మి, అందే దొరబాబు, డీపీఓ ఎస్.రామనాథరెడ్డి, తహసీల్దార్ రాజ్‌కిషోర్, డీఎల్పీఓ జ్యోతిర్మయి, డిప్యూటీ ఎంపీడీఓ నవీన్‌కిరణ్, పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏరులై పారుతున్న నకిలీ మద్యం



నరసాపురంలో మహిళా నేతలతో కలిసి ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, పార్టీ నాయకులు

- సీబీఐ దర్యాప్తు జరిపించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు డిమాండ్

నరసాపురం: పైకి బ్రాండెడ్ లేబుళ్లు, పక్కా బ్యాచ్ నంబర్లు ఉన్న మద్యం బాటిళ్ల మూతలు తెరిస్తే నాసిరకం, నకిలీ మద్యం ప్రజల ప్రాణాలు తీస్తున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మండిపడ్డారు. రాష్ట్రం అంతా నారవారి వాకిట్లో తయారైన నకిలీ మద్యం ఏరులై పారుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం అరికట్టాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం నరసాపురంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం వ్యవహారం బట్టబయలైనా కూటమి ప్రభుత్వం నోరుమెదపక పోవడం దారుణమన్నారు. పైగా వైఎస్సార్‌సీపీ అల్లరి చేస్తుందని కూటమి నేతలు ఎదురుదాడి చేయడం సిగ్గుచేటన్నారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నరసాపురం పక్కనే ఉన్న పాలకొల్లులోనే మద్యం తయారీ వ్యవహారం వెలుగులోకి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. కూటమి నేతలే మద్యం సిండికేట్లుగా అవతారమెత్తి వ్యవహారాలు నడుపుతున్నారని ఆరోపించారు. వీధివీధినా బెల్ట్‌షాపులు వెలిసినా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. నకిలీ మద్యం నివారణ, ఎమ్మార్పీ ధరలకు విక్రయాలు, బెల్ట్‌షాపులు అరికట్టేందుకు వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ రాంబాబుకు వినిపత్రం అందించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, పార్టీ సీఈసీ సభ్యుడు పీడీ రాజు, పెండ్ర వీరన్న, జెడ్పీటీసీలు బొక్కా రా ధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’పై కూటమి కుట్రలు

- నేడు జర్నలిస్ట్, ప్రజాసంఘాలతో ధర్నాలు
- దాడులను నిరసిస్తూ అధికారులకు వినతులు

సాక్షి, భీమవరం: నకిలీ మద్యంపై వార్తలు రాసినందుకు సాక్షి మీడియాపై కూటమి కుట్రలు కొనసాగుతున్నాయి. పోలీసులను అడ్డంపెట్టుకుని చంద్రబాబు సర్కారు కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. నోటీసులు, విచారణల పేరుతో పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన హక్కులను కాలరాస్తోంది. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డికి నాలుగురోజుల వ్యవధిలో పోలీసులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛపై, ప్రజల పక్షాన పోరాడుతున్న సాక్షిపై కూటమి దాడిని ఖండిస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా జర్నలిస్ట్, ప్రజాసంఘాలు శాంతియుతంగా నిరసన తెలిపి అధికారులకు వినతులు అందజేయనున్నట్టు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా తెలిపారు. భీమవరంలో జరిగే కార్యక్రమంలో జర్నలిస్టులు, ప్రజాసంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సాక్షిని అణగదొక్కాలని..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు నిజాలు తెలియకుండా సాక్షిని అణగదొక్కాలని చూస్తోంది. విచారణ పేరుతో మీడియా ప్రతినిధులను వేధింపులకు గురిచేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. దీనిని అందరూ సంఘటితంగా ఎదుర్కోవాలి.

– బంధన పూర్ణచంద్రరావు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



పత్రికా స్వేచ్ఛను కాలరాయాలని చూడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిది. పత్రికా కథనాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే న్యాయబద్ధంగా ఎదుర్కోవాలే తప్ప ఇలా వ్యవహరించడం సరికాదు. ప్రభుత్వ చర్యల్ని ఖండిస్తున్నాం. సాక్షి మీడియా ప్రతినిధులపై వేధింపులు ఆపాలి.

– కోనాల భీమారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి

శ్రీవారి అంతరాలయ దర్శనం పునరుద్ధరణకు చర్యలు

అయ్యంగార్ ఫిర్యాదు, ‘సాక్షి’ వరుస కథనాలతో అధికారుల్లో కదలిక



అంతరాలయం ముందు భాగంలో స్వామివారికి జరుగుతున్న శ్రీపుష్ప యాగోత్సవం (ఫైల్)

ద్వారకాతిరుమల: ద్వారాకతిరుమల చినవెంకన్న ఆలయంలో పాత పద్ధతిలో స్వామివారి అంతరాలయ దర్శనం, అలాగే అంతరాలయం (అమ్మవార్లు) ముందు భాగం నుంచి భక్తులకు సాధారణ దర్శనం కల్పించేందు అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మధ్యాహ్నం ట్రయిల్‌రన్ వేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఏలూరుకు చెందిన ఆధ్యాత్మికవేత్త, హైకోర్టు న్యాయవాది అయ్యంగార్ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు చేసిన ఫిర్యాదు, ‘సాక్షి’ వరుస కథనాలతో అధికారుల్లో కదలిక వచ్చింది. వివరాల్లోకి వెళితే. ఐదేళ్ల క్రితం కోవిడ్ కారణంగా అధికారులు శ్రీవారి అంతరాలయ దర్శనాన్ని, అలాగే అమ్మవార్ల ముందు నుంచి భక్తులకు సాధారణ దర్శనాన్ని నిలిపివేశారు. కోవిడ్ నిర్మూలన అనంతరం ఇతర ఆలయాల్లో అంతరాలయ దర్శనాలు పునః ప్రారంభం అయిననా, శ్రీవారి ఆలయంలో మాత్రం పునరుద్ధరణ కాలేదు. దీంతో భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను బయట (దూరం) నుంచే దర్శించుకోవాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే అధికారులు అంతరాలయ దర్శనం టికెట్ రూ.500లుగా నిర్ణయించి, దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఎప్పుడో అనుమతులు పొందినా దానినీ అమలు పరచలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా గతంలో ఉన్న చెక్కల ర్యాంప్‌ను మళ్లీ ఆలయ అంతరాలయం ముందు భాగంలో ఏర్పాటుచేశారు. భక్తులు తూర్పు గుమ్మం లోంచి ఆలయంలోకి ప్రవేశించి, చెక్కల ర్యాంపు మీదుగా వెళుతూ స్వామి, అమ్మవార్లను దగ్గర నుంచి దర్శించే పాత విధానాన్ని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తికి అధికారులు వివరించారు. అయితే ఇన్నేళ్లుగా మూలనపడి ఉన్న చెక్కల ర్యాంప్ దెబ్బతినడంతో ట్రయిల్‌రన్ వేయడం కుదరలేదు. దీంతో ర్యాంపునకు మరమ్మతులు చేయించాలని ఈఓ ఆదేశించారు. ఈనెల 21న అమావాస్య తరువాత అంతరాలయం, సాధారణ దర్శనాన్ని పునరుద్ధరించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో అంతరాలయ దర్శనాన్ని రద్దు చేసి, మిగిలిన రోజుల్లో పునరుద్ధరించాలని నిర్ణయించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



పాలిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కారుమూరి

అత్తిలి: పేదలకు ఉచిత వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే, కూటమి సర్కారు వాటిని ప్రైవేటుపరం చేయడానికి పూనుకోవడం దుర్మార్గమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా గురువారం అత్తిలి మండలం పాలి, కె. సముద్రపుగట్టు, అత్తిలి పెదపేటలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టేలా వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని దుయ్యబట్టారు. కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజలు సేవల కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తుందన్నారు. చంద్రబాబు కుటిల యత్నాలను అడ్డుకునేలా జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతిఒక్కరూ సంతకాల సేకరణకు ముందుకు వచ్చి గవర్నర్‌కు సమర్పించేందుకు సంఘీభావం తెలపాలని కోరారు. చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కళాశాలను కూడా తీసుకురాలేకపోయారన్నారు. ప్రజారోగ్యానికి జగన్ ఎంతో ప్రాధాన్యమిచ్చారని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచితే నేడు కూటమి సర్కారు అటకెక్కించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఏది చూసినా నకిలీ అని భయమేసే పరిస్థితి ఉందన్నారు. ప్రజలను లక్షాధికారులను చేస్తానని చంద్రబాబు అబద్ధాలు చెప్పి నట్టేట ముంచారని అన్నారు. తణుకులో పశువధ యథేచ్ఛగా సాగుతోందని, జూద క్రీడలకు నిలయంగా మారిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్ధరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్‌లు కేతా గౌరీపార్వతి, కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి నాగమణి, అనిశెట్టి త్రిమూర్తులు, ఆడారి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, పోలినాటి చంద్రరావు, సబ్బితి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కారు డిక్కీలో క్షతగాత్రురాలి తరలింపు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
- మహిళకు తీవ్రగాయాలు
- సమయానికి రాని 108 వాహనం



తేతలిలో గాయపడ్డ మహిళను చెక్కపై పడుకోబెట్టి కారు ఎక్కిస్తున్న స్థానికులు



మహిళను కారు వెనుక భాగంలో ఎక్కించి తీసుకెళ్తున్న దృశ్యం

తణుకు అర్బన్: జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన తేతలిలో గురువారం చోటుచేసుకుంది. తేతలి ఇండస్ట్రీయల్ ఏరియాలోకి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గుర్తుతెలియని మహిళను తాడేపల్లిగూడెం వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. వాహన సీటు దూరంగా పడిపోగా వాహనం తిరగబడిన తీరు ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. దీంతో మహిళకు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. కారు ఢీకొట్టిన వేగానికి ద్విచక్ర వాహనంతోపాటు మహిళ కూడా గాల్లోకి ఎగిరిపడినట్టు స్థానికులు చెబుతున్నారు.

108 కోసం అరగంట వేచిచూసినా..

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేసినా అరగంట వరకూ జాడ లేకపోవడంతో చేసేది లేక మహిళ పరిస్థితి చూసిన ప్రయాణికులు ఒక కారు వెనుక భాగంలో డిక్కీ తెరిచి పొడవాటి చెక్కను పెట్టి దానిపై ఆమెను పడుకోబెట్టి ఆస్పత్రికి తరలించారు. ఈ దృశ్యం చూపరులకు కంటతడి పెట్టించింది. అయితే ఆ మహిళ ఎవరు, ఏ ఆస్పత్రికి తీసుకువెళ్లారనే విషయాలు తెలియలేదు. ప్రమాదం జరిగిన తరువాత ఘటనా ప్రాంతానికి పోలీసులు వెళ్లారని అయితే ఎటువంటి వివరాలు తెలియకపోగా, బాధిత వర్గాల నుంచి ఫిర్యాదు కూడా రాలేదని తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ చెప్పారు.

బార్ కోడ్ స్కాన్ చేసి మద్యం కొనాలి

భీమవరం: వినియోగదారులు మద్యం బాటిళ్లపై బార్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాతే కొనుగోలు చేయాలని జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ అధికారి కేవీఎన్ ప్రభుకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. షాపుల్లో విక్రయిస్తున్న మద్యం కల్తీదా, నాణ్యమైనదా తెలుసుకోడానికి ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను రూపొందించినట్టు పేర్కొన్నారు. బాటిల్ మూతపై అతికించిన స్టిక్కర్‌కు ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే బ్రాండ్ నేమ్, సైజ్, బ్యాచ్ నంబర్, ఎమ్మార్పీ, ఏ షాపులో విక్రయించారనే వంటి సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు. స్టిక్కర్ బీర్ సీసాలపై అతికించనందున యాప్‌తో బీర్ బాటిల్ స్కాన్ చేయడానికి వీలుపడదని స్పష్టం చేశారు. జిల్లాలో నకిలీ మద్యానికి అవకాశం లేకుండా తనిఖీలు ముమ్మరం చేశామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

అవార్డు గ్రహీత రాంప్రసాద్‌కు సత్కారం



భీమవరం డీఎన్నార్ కళాశాలలో రాంప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అంతర్జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల ఏఐఅండ్‌డీఎస్ విభాగాధిపతి కె సూర్యరాంప్రసాద్‌ను గురువారం కళాశాలలో ఘనంగా సత్కరించారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును తమ కళాశాలకు చెందిన రాంప్రసాద్ అందుకోవడం తమ కళాశాలకే గర్వకారణమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అన్నారు. సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీ సంస్థ అవార్డుల ప్రదానోత్సవాన్ని విజయవాడలో నిర్వహించగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచేగాక పలు దేశాల నుంచి సుమారు 200 మంది ప్రొఫెసర్లు పాల్గొనడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడిచెట్టుపై నుంచి పడి గిరిజనుడు మృతి



తన సోదరుడు కన్నయ్య భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం : మండలంలోని దుద్దుకూరుకు చెందిన గిరిజనుడు తెల్లం కన్నయ్య(60) తాడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ జారి కిందపడి గురువారం మృతిచెందాడు. మృతుడు కన్నయ్య మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు సోదరుడు. కన్నయ్య మరణ వార్త విన్న బాలరాజు కన్నీరు మున్నీరయ్యారు. కన్నయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కన్నయ్య కుటుంబానికి పెద్ద దిక్కు అని, ప్రభుత్వం కన్నయ్య కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని బాలరాజు కోరారు.

నకిలీ విలేకరుల హల్‌చల్



నకిలీ ఐడీ కార్డుతో ఉన్న వ్యక్తి

పెదపాడు: నకిలీ విలేకరులు పెదపాడు మండలంలో హల్‌చల్ చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాల వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదే క్రమంలో గురువారం ఖాళీగా వెళ్తున్న ఓ వాహనాన్ని ఆపి నకిలీ విలేకరి డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో అనుమానించిన ఆ వాహనదారుడు ఆ వ్యక్తిని నకిలీ విలేకరిగా గుర్తించి పెదపాడు పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తి తాను పేరొందిన మీడియా సంస్థలో పనిచేస్తున్నట్లు పోలీసులను నమ్మబలికాడు. అతని వద్ద ఉన్న ఐడీ కార్డును పరిశీలించి నకిలీ విలేకరుగా పోలీసులు గుర్తించి వారి వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా గుడివాడ ఎమ్మెల్యే కార్యాలయంలో పనిచేసే ప్రదీప్ అనే వ్యక్తి వచ్చి సదరు వ్యక్తిని తీసుకువెళ్లినట్లు చెబుతున్నారు. దీంతో సదరు నకిలీ విలేకరికు 41 నోటీసు అందించినట్లు విశ్వసనీయ సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అప్పు చేసి పప్పుకూడు.. ఎన్నాళ్లు ?

- వంట బకాయిలు అందక ఎండీఎం నిర్వాహకుల అవస్థలు
- అరకొరగా నిధులు కేటాయిస్తున్న కూటమి సర్కారు
- కళాశాలకు 5 నెలలు, యూపీలకు 3 నెలలుగా నిలిచిన చెల్లింపులు
- పెరిగిన ధరలతో అప్పులతో కొనసాగిస్తున్న నిర్వాహకులు



భోజన పథకంలో బిర్యానీ వడ్డిస్తున్న కార్మికులు



సమస్యలపై ఎండీఎం నిర్వాహకులు, కార్మికుల ఆందోళన (ఫైల్)

నిడమర్రు: ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపునకు, పోషకాహారలోపం నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన నిధులకు గ్రహణం పట్టింది. ఈ పథకం నిర్వాహకులకు నిధులను సకాలంలో చెల్లించకపోవడంతో వారికి భారమవుతోంది. సరైన సమయానికి బిల్లులు రాకపోయినా, పిల్లల ఆకలి తీర్చడానికి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు అప్పులు చేసి వండి వడ్డిస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం కళాశాలల్లో నిర్వాహకులకు 5 నెలల నుంచి, యూపీ స్కూళ్లలో నిర్వాహకులకు జూలై నుంచి బిల్లులు కూటమి సర్కారు మంజూరు చేయలేదు. మరోవైపు వంట సహాయకులకు ఇచ్చే రూ.3 వేలు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలంటూ విడతల వారీగా ఇస్తున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలల్లో పరిస్థితి మరింత దారుణం

గ్రామీణ ఇంటర్ కళాశాలల్లో గత ఏడాది నుంచి అమలవుతున్న భోజన పథకం నిర్వాహకుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారికి ఫిబ్రవరి నెల నుంచి నిర్వహణ నిధులు కేటాయించకపోవడంతో వారంతా అప్పులు మీద అప్పులు చేసే పరిస్థితి నెలకొంది. ఉంగుటూరు మండలంలో నారాయణపురం, గణపవరం గ్రామాల్లో మాత్రమే రెండు ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. బిల్లులు నెలలుగా బకాయి పడటంతో అప్పుల భారంతో కొన్ని చోట్ల మెనూ సక్రమంగా అమలు చేయడం లేదనే వాదనలు ఉన్నాయి. బియ్యం, గుడ్లు, రాగిపిండి, పప్పు చిక్కీలను ప్రభుత్వం సరఫరా చేసినా, అవసరమైన వంట గ్యాస్, కూరగాయలు, పప్పు, ఇతర వంట సామగ్రి నిర్వాహకులే కొనుగోలు చేసుకోవాల్సి ఉంది. ఇవన్నీ దుకాణాల వద్ద అరువు తీసుకొచ్చి వంట చేస్తున్నారు. తమకు రావాల్సిన సొమ్ములు ప్రభుత్వం నుంచి అందకపోవడం, అరువు ఇచ్చిన దుకాణదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో అందినచోట అప్పులు చేసి ఆర్థిక భారానికి గురవుతున్నామని వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చేది అరకొర.. అదీ నెలల తరబడి

భోజన పథకం నిర్వాహకులకు మెనూలోని వంటల తయారుకు ఇచ్చేది అర కొర నిధులు, అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లతో అనేక సమస్యలతో వారు సతమతమవుతున్నట్లు చెబుతున్నారు. మెనూ ప్రకారం సోమవారం కూరగాయలు/ ఆకు కూర పప్పు, మంగళవారం పులిహోర, రోటీ పచ్చడి, బుధవారం మిశ్రమ కూరగాయల కూర, గురువారం పలావు, బంగాళ దుంప కుర్మా, శుక్రవారం ఆకు కూర పప్పు, శనివారం మిశ్రమ కూరగాయాల కూర, చక్కెర పొంగల్ వండాలి. వీటితోపాటు రైస్ వండాలి, వారానికి మూడు రోజులు రాగిజావ, గుడ్డును వడ్డించాల్సి ఉంది. వీటి తయారీకి మాత్రం ప్రాథమిక విద్యార్థులకు రూ. 5.88, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ రూ.8.57 ఒక్కో విద్యార్థికి వంట, సరుకుల కొనుగోలు ఖర్చుల కింద చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఇచ్చే నగదు మార్కెట్‌లో ఒక్క ఇడ్లీ కూడా రాదంటూ వాపోతున్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో ఎండీఎం కార్మికులు ఆందోళన అనంతరం అర కొరగా బిల్లులు మంజూరు చేసినట్లు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	పాఠశాలలు నమోదు	ఎండీఎం	కార్మికులు
ఏలూరు	1,710	92,203	5,732
పశ్చిమగోదావరి	1,384	78,755	4,350

ఎండీఎం నిర్వాహకుల డిమాండ్లు ఇవీ

- ప్రతీ నెలా 5వ తేదీలోపు గౌరవ వేతనం, వంట ఖర్చుల బిల్లులు చెల్లించాలి.
- గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలి, మెనూ ఖర్చుల చార్జీలు పెంచాలి.
- మూతపడుతున్న స్కూళ్లలోని నిర్వాహకులకు ఉపాధి భద్రత కల్పించాలి,
- యూనీఫాం, గుర్తింపు కార్డులు ప్రభుత్వం అందించాలి.
- గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలి.
- ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.

గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచాలి



పెరుగుతున్న ఖర్చులతో గత కొన్నేళ్లుగా ఇస్తున్న గౌరవ వేతనం నెలకు రూ.3 వేలు సరిపోవడం లేదు. ప్రభుత్వం స్పందించి గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచాలి. మూతపడుతున్న స్కూళ్లలో ఎండీఎం కార్మికులు, ఆయాలు రోడ్డున పడుతున్న పరిస్థితి, వీరందరికి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– మోడియం నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎండీఎం కార్మిక సంఘం

అప్పులు చేసి వంటలు చేయాల్సిన పరిస్థితి



బిల్లులు 3, 4 నెలలు ఆలస్యంగా జమవ్వడంతో ప్రతి నెలా అప్పులు చేసి వంటలు చేయాల్సిన సరిస్థితి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచితే ఆర్థిక భారం తగ్గుతుంది. యూపీ బిల్లులు జూలై నెల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. విడతల వారీగా వేయడంతో బ్యాంక్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– కాసాని సత్తెమ్మ, నిర్వాహకురాలు, ఎండీఎం ఏజెన్సీ

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రవికుమార్, చిత్రంలో ఎస్సై కేసీహెచ్ స్వామి

తాడేపల్లిగూడెం రూరల్ : చోరీ కేసులో ఇద్దరు నిందితులతో పాటు ఒక మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు తాడేపల్లిగూడెం రూరల్ సీఐ బీబీ రవికుమార్ తెలిపారు. గురువారం తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. పెంటపాడు మండల, పరిసర ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల చోరీ, దొంగతనాలకు సంబంధించి పలు కేసులు నమోదయ్యాయన్నారు. ఈ క్రమంలోనే రావిపాడు గ్రామానికి చెందిన పెదపోలు శ్రీనివాస్ తన ఇంటి ముందు షెడ్డులో ఉన్న మోటారు సైకిల్ చోరీకి గురైనట్లు గత నెల 18న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ముందస్తు సమాచారం మేరకు చిలకంపాడు లాకుల వద్ద ర్యాలీ లోకేష్, మానుపాటి దుర్గాప్రసాద్, మరో మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, మోటారు సైకిళ్ల దొంగతనాలను వారు అంగీకరించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఐదు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించగా, లోకేష్, దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేశామన్నారు. మోటారు సైకిళ్ల విలువ రూ.2.75 లక్షలుగా పేర్కొన్నారు. మానుపాటి దుర్గాప్రసాద్‌పై తణుకు, ఇరగవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆలయాల్లో హుండీ, ఇళ్లు, మోటారు సైకిళ్ల దొంగతనాలకు సంబంధించి పలు కేసులు ఉన్నాయన్నారు. కాగా, ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పెంటపాడు ఎస్సై కేసీహెచ్ స్వామి, కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, బి.మోహన్, కే.నవీన్, డి.వెంకటేశ్వరరావులను అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు !

- గణితం, ఇంగ్లీషు బోధించడానికి ఈసీఈ ఫ్యాకల్టీ!
- ట్రిపుల్ ఐటీలో పీయూసీ బోధన తీరుపై విమర్శలు



నూజివీడు: ఇంటి పెద్ద ఇల్లును పట్టించుకోకపోతే ఇల్లు ఎలా గాడి తప్పి పతనమవుతుందో... ఇలాంటి పరిస్థితే ట్రిపుల్ ఐటీలో నెలకొంటోంది. ట్రిపుల్ ఐటీ అంటే ఎంతో ఉన్నత స్థాయి విద్యాసంస్థ అని ప్రజలు భావిస్తుండగా, యాజమాన్యం మాత్రం నవ్వులపాలయ్యే నిర్ణయాలు తీసుకుంటోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న 10 మంది ఫ్యాకల్టీకి ఉద్యోగాలు రావడంతో వారు ఇక్కడ ఉద్యోగాలకు రిజైన్ చేసి వెళ్లిపోయారు. దీనిలో భాగంగానే నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న శ్రీకాకుళం పీయూసీలో గణితం, ఇంగ్లీషు బోధిస్తున్న రాజేష్, రమాదేవి అనే ఫ్యాకల్టీకి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు రావడంతో వారు రిజైన్ చేసి వెళ్లిపోయారు. దీంతో గణితం, ఇంగ్లీషు బోధించేందుకు ఫ్యాకల్టీ అవసరమైంది. ఈ పరిస్థితుల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధించే ఈసీఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను పీయూసీలో గణితం, ఇంగ్లీషు సబ్జెక్టులను బోధించేందుకు నియమిస్తూ శ్రీకాకుళం డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై ట్రిపుల్ ఐటీలోని ఫ్యాకల్టీ సిబ్బందిలోనే విస్మయం వ్యక్తమవుతోంది. ఇంజినీరింగ్‌లో ఈసీఈ విద్యార్థులకు బోధించాల్సిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను పీయూసీలో గణితం, ఇంగ్లీషు సబ్జెక్టులు బోధించడానికి ఎలా నియమిస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెస్సీ, ఎంఏ చదివిన వారు అర్హులు కదా..!

పీయూసీలో గణితం బోధించడానికి ఎమ్మెస్సీ గణితం చదివిన వారు, ఇంగ్లీషు బోధించడానికి ఎంఏ ఇంగ్లీషు చేసిన వారు అర్హులు కాగా, ఈసీఈ చదివిన వారు ఎలా చెబుతారో అంతుబట్టడం లేదు. ఎంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన ఇంజినీరింగ్ విద్యను అందించే ట్రిపుల్ ఐటీలాంటి సంస్థలో యాజమాన్యం సరైన నిర్ణయాలు తీసుకోకుండా విద్యార్థుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం దారుణం. అర్హత ఉన్న వారు లేకపోతే నియమించుకోవాలే తప్ప ఇలా అనర్హులతో బోధన చేయిస్తే రేపు పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తే ఎవరు బాధ్యత వహిస్తారో యాజమాన్యమే బదులివ్వాల్సిన అవసరం ఉంది.

ఈసీఈ ఫ్యాకల్టీని తిరస్కరించాం

పీయూసీ విద్యార్థులకు గణితం, ఇంగ్లీషు సబ్జెక్టులను బోధించడానికి ఈసీఈ ఫ్యాకల్టీని నియమించినప్పటికీ దానిని తిరస్కరించాం. క్వాలిఫైడ్ ఫ్యాకల్టీతోనే బోధన చేయిస్తాం. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ నుంచి వచ్చిన ఆర్డర్‌ను కుదరదని తిప్పి పంపించాం.

– ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్

పంచాయతీ పూర్వపు భవనాలకు మోక్షం



స్థానిక గంగానమ్మకోడు ప్రాంతంలో పంచాయతీ పాత భవన ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో గంగానమ్మకోడు ప్రాంతంలో నిర్మించిన పంచాయతీ అసంపూర్తి భవనాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవల సాక్షిలో వచ్చిన కథనానికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఆక్రమణల్లో ఉన్న భవన ప్రాంగణాల్ని ఖాళీ చేయించారు. ఆకివీడు పంచాయతీ పరిధిలోని ఈ ప్రాంతంలో 20 ఏళ్ల కూరగాయలు, మాంసం, చేపల దుకాణాల్ని ఏర్పాటు చేసేందుకు భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే ఆ ప్రాంతం తనదేనని, తన వద్ద రికార్డులున్నాయని ప్రైవేటు వ్యక్తి కోర్టుకు వెళ్లారు. దీంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో బిచ్చగాళ్లు, అనాథలు ఆక్రమించుకుని నివాసం ఉంటున్నారు. స్థానికులు కూడా కొంత ఆక్రమించారు. ఇటీవల బిచ్చగాళ్లను, అనాథల్ని అక్కడ నుండి పంపించివేసి, ఆ అసంపూర్తి భవనాల్ని ఆక్రమించారు. దీనిపై సాక్షిలో కథనం రావడంతో స్పందించి, వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. అసంపూర్తి భవన నిర్మాణాల్ని పూర్తి చేసి, అవసరమైతే కూరగాయల వ్యాపారాలకు, ఇతరులకు అద్దెకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఆ ప్రాంతాన్ని గురువారం ఉపసభాపతి కె.రఘురామకృష్ణంరాజు, నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్ సందర్శించారు. ఆ భవనాలను సద్వినియోగంచేసుకోవాలని ఆదేశించారు.

ఏజెన్సీలో ఆగని మట్టి రవాణా

- రాత్రి, పగలు తేడాలేకుండా తోలకాలు
- పట్టించుకోని అధికారులు



బుట్టాయగూడెం మండలంలోని ఎన్‌ఆర్‌పాలెంలో కొండను తవ్వేసిన దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శిస్తున్నారు. బుట్టాయగూడెం మండలం ఎన్‌ఆర్‌పాలెం సమీపంలో ఇటీవల ఒక గిరిజనుడికి చెందిన పట్టా భూమిలో ఉన్న కొండను కూటమి నాయకులు నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లు పెట్టి లారీలతో మట్టి రవాణా చేస్తూ సొమ్ములు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ కొండను తవ్వి చదును చేసేందుకు పీసా కమిటీ తీర్మానం చేసుకున్నామని గిరిజనులు చెబుతున్నప్పటికీ అది ఆ గ్రామ పరిధిలో తప్ప లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించే అవకాశం లేదని పలువురు వాపోతున్నారు. ఇక్కడ తవ్విన మట్టిని బుట్టాయగూడెం పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ కూటమి నాయకులు సొమ్మును కొల్లగొడుతున్నారని ఆరోపిస్తున్నారు.

మట్టి దోపిడీని అరికట్టాలి



నూతిరామన్నపాలెంలో అక్రమంగా మట్టిని తరలిస్తూ కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. అది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు ఉండడం బాధాకరం. ఇప్పటికైనా అక్రమ మట్టి రవాణాపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

ట్రిపుల్ ఐటీలో మ్యూజిక్ వర్క్‌షాప్ నిర్వహణ



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న గాత్ర విద్వాంసురాలు లలితా చంద్రశేఖర్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో గురువారం సంగీత విభాగం ఆధ్వర్యంలో మ్యూజిక్‌పై వర్క్‌షాపును నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రముఖ గాత్ర విద్వాంసురాలు, సంగీత సుధానిధి వీ లలితా చంద్రశేఖర్ పాల్గొని భారతీయ సంగీతంలోని ప్రాథమిక అంశాలు, విద్యార్థులకు కలిగే ఉపయోగాలు అనే అంశంపై ఉపన్యసించారు. దేశంలో ముఖ్యంగా హిందూస్తానీ, కర్ణాటక సంగీతాలున్నాయన్నారు. సంగీతంలో స్వరాలు, రాగాలు ముఖ్యమైనవని, భావాలను, మానసిక స్థితిని వ్యక్తపరచడానికి రాగాలను ఉపయోగిస్తారన్నారు. సంగీతం వినడం ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత కలగడం, సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ పెరగడం, జ్ఞాపకశక్తి మెరుగుపడటం, క్రమశిక్షణ అలవడటంతో పాటు విద్యార్థులకు విద్యాపరమైన పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. అనంతరం సంగీత కచేరీ చేస్తూ కచేరీ పద్ధతిపై సోదాహరణగా వివరించారు. వీరికి వయోలిన్‌పై జే చంద్రమౌళి, మృదంగంతో మంగళగిరి శ్రీధర్ తమ సహకారాన్ని అందజేశారు. లలిత విద్యార్థులకు దీక్షితార్ నోటు స్వరం నేర్పించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఏఓ బీ లక్ష్మణరావు, సంగీత విభాగం హెచ్‌ఓడీ జే చంద్రమౌళీ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్ సీజ్

పెంటపాడు: అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా గోడౌన్‌పై పెంటపాడు పోలీసులు దాడి చేసి సీజ్ చేశారు. ప్రత్తిపాడు ఆటోనగర్ ప్రాంతంలో గూడెంకు చెందిన ఒక వ్యాపారి గుట్టుగా బాణసంచాను గోడౌన్‌లో నిల్వ ఉంచాడు. ఈ గోడౌన్‌ను ఎస్సై స్వామి ఆధ్వర్యంలో పరిశీలించి సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. తదుపరి చర్యల కోసం రెవెన్యూ, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించామన్నారు.

బాణసంచా.. తస్మాత్ జాగ్రత్త!



భీమవరం లూథరన్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

భీమవరం: దీపావళి అంటే పిల్లలు, పెద్దలు అందరికీ పండుగే. పండుగకు 15 రోజుల ముందునుంచే బాణసంచా తయారీ, కొనుగోలుపై దృష్టిపెడతారు. గత కొన్నేళ్లుగా వివిధ రకాల కంపెనీల బాణసంచా మార్కెట్‌లోనికి రావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బాణసంచా విక్రయ కేంద్రాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట తదితర ప్రాంతాల్లో తాత్కాలికంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేసుకోడానికి 200కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. భీమవరం పట్టణంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు 25 మంది దరఖాస్తు చేసుకోగా లూథరన్ హైస్కూల్ ఆవరణలో ఇప్పటికే కొన్ని దుకాణాలు వెలిశాయి. జనావాసాలకు దూరంగా దుకాణాలు పెద్ద సంఖ్యలో ఒకే చోట ఏర్పాటు చేస్తున్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దుకాణాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బాణసంచా దుకాణాల వద్ద మండే స్వభావం కల్గిన వస్తువులను ఉంచరాదు.
- ఒక్కొక్క దుకాణం మధ్య కనీసం మూడు మీటర్ల దూరం తప్పనిసరి.
- నూనె, గ్యాస్ దీపాలు వంటివి దుకాణాల్లో పెట్టకూడదు.
- బాణసంచా దుకాణాల వద్ద బాణసంచాను పరీక్షించేందుకు దుకాణ యజమానులు అంగీకరించకూడదు.
- విక్రయదారులు తక్కువ ప్రేలుడు స్వభావాన్ని కలిగిన బాణసంచా మాత్రమే అమ్మకాలు చేయాలి తప్ప స్థానికంగా తయారుచేసిన తారాజువ్వలు, చిచ్చు బుడ్లు, తాటాకు టపాకాయలు, నార బాంబులు వంటివి అనగా ఎక్కువ ప్రేలుడు స్వభావాన్ని కలిగిన గన్ పౌడర్, నైట్రేట్, క్లోరేట్, అల్యూమినియం మిశ్రమంతో తయారు చేసిన మందుగుండును విక్రయించరాదు.
- ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవిస్తే అగ్నిమాపకవాహనం రావడానికి వీలుగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలి. దుకాణాల వద్ద 9 లీటర్ల సామర్థ్యం కల్గిన నాలుగు ఫైర్‌బకెట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. రెండిటినీ పొడి ఇసుకతో, మరో రెండింటినీ నీటితోనూ నింపాలి.
- బాణాసంచా దుకాణాల వద్ద పొగ తాగడాన్ని పూర్తిగా నిషేధించాలి.
- దుకాణాల వద్ద స్థానిక ఫైర్ స్టేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 101, పోలీసు డిపార్ట్‌మెంట్ టోల్ ఫ్రీ నెంబర్ 100 ప్రదర్శన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బాణసంచా విక్రయ దుకాణాల వద్ద తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. దుకాణదారులకు బాణసంచా తయారీకి అనుమతులు లేవు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి విక్రయించే బాణసంచాను 18 ఏళ్లలోపు పిల్లలకు విక్రయించకుండా తగిన జాగ్రత్తలతో వ్యాపారం చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె శ్రీనివాసరావు, ఏడీఎఫ్‌ఓ, భీమవరం

క్లుప్తంగా

ఒంటరి మహిళ ఉపాధికి దుకాణం ప్రారంభం



బంగారుగూడెంలో స్టార్టప్ బిజినెస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బంగారుగూడెం గ్రామంలో ఒంటరి మహిళ ఆర్థికాభివృద్ధికి బడ్డీ కొట్టును సంస్థ వ్యవస్థాపకురాలు చెన్నా త్రికళ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంటరి మహిళలను ప్రోత్సహించేందుకు స్టార్టప్ బిజినెస్ ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకు పలువురు దాతలు ఇతోధికంగా సహకరించారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి ప్రాజెక్టులు ఏర్పాటుకు సంస్థలు, వ్యక్తుల సహకారం అవసరమని పిలుపునిచ్చారు. సంస్థ ప్రతినిధులు చెన్నా జనార్ధనరావు, బ్రహ్మాజీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు మండల స్థాయి పోటీలు

అత్తిలి: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అత్తిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో గురువారం బాలికలకు మండల స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈపోటీలలో వ్యాసరచన, వక్తృత్వం, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి, పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి, కనకమహాలక్ష్మి, విజయ్ కుమారి, పీఈటీలు దిలీప్ కుమార్, రమేష్, వైఎస్సార్ సోమయాజులు, శ్రీవాణి, త్రివేణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



కాంస్య పతకం సాధించిన విద్యార్థి దేవతో హెచ్ఎం ఫణిశ్రీ, పీడీ సూర్యనారాయణ

తణుకు అర్బన్: 69వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్ 17 బాక్సింగ్ పోటీల్లో తణుకు మండలం మండపాక విద్యార్థి ఎ.దేవా కాంస్య పతకం సాధించాడు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు రాజమండ్రి ఎస్‌కేవీటీ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో పాఠశాల నుంచి విద్యార్థులు ఎల్.పూజ, ఆర్.దీపిక, ఎస్.నాగ గణేష్, కె.లోహిత్, ఏ.దేవా పాల్గొనగా 68 కిలోల విభాగంలో దేవా కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఫణిశ్రీ తెలిపారు. ఇంతటి ఘనత సాధించిన దేవాతోపాటు శిక్షణనిచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

సీపీఆర్‌పై అవగాహన



తణుకులో సీపీఆర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: ప్రపంచ అనస్థీషియా డే సందర్భంగా తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆపిల్ ఆస్పత్రి ఆవరణలో గుండెనొప్పితో ప్రాణాపాయంలో ఉన్న వారికి సీపీఆర్ చేసే విధానాన్ని వైద్యులు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. నర్సింగ్ కళాశాల సాంకేతిక సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ అమీనా, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ డి.డిండిమ విద్యార్థినులకు సీపీఆర్ చేసే విధానాన్ని చూపించారు. క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.సుధాకర్, ఎ.దినేష్, అక్కిన కాశీ విశ్వనాథం, పుట్టా రామచంద్రరావు, ఆకుల శేషుబాబు, బోడపాటి ప్రసాద్, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, అడ్డాల ప్రసాద్, జీఎస్ సుబ్రహ్మణ్యం, బసవ రామకృష్ణ, డాక్టర్ వెలిచేటి సుందరరావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పడిపూజ



తణుకు అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ నిర్వహించిన దృశ్యం

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారికి సమీపంలోని ధర్మ శాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివారికి పడిపూజ నిర్వహించారు. చలపతి గురుస్వామి ఆధ్వర్యంలో యాతం నాగబాబుచే పడిపూజ అత్యంత వైభవంగా జరిపారు. అయ్యప్ప మాలదారులు, భక్తులు అధికసంఖ్యలోపాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాలనీకి వెళ్లే దారేదీ?

- ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీ వాసులు
- చిన్న వర్షానికే చిత్తడిగా మారుతున్న రహదారులు
- వర్షపునీరు, మురుగునీరు ఏకమై దుర్వాసన వస్తున్న వైనం
- కొద్దిరోజులుగా నీటిలోనే మగ్గుతున్న గృహాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు





కొండేపాడు జగనన్న కాలనీ, పాతకాలనీకి వెళ్లే దారి చెరువులా మారిన దృశ్యం

పెంటపాడు: అసలే వర్షాకాలం ఆపై వ్యాధులు ప్రబలడంతో, దీనికి తోడు వర్షాలతో గత కొన్ని రోజులుగా పెంటపాడు మండలంలోని కొండేపాడులో పాత ఎస్సీపేట, జగనన్న కాలనీకి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా తయారవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కాలనీలో సరైన రహదారులు లేకపోవడం వల్ల కొద్దిపాటి వర్షం కురిసినా పడుతున్న అవస్థలు అన్నీ, ఇన్నీ కావు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లోని వృథానీరు ఎటూ పోయే మార్గం లేక వర్షపు నీరు ఏకమై రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా జగనన్న కాలనీకి, పాత ఎస్సీపేట కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. స్థానిక కొత్తూరు నుంచి ఏటిగట్టు వరకు ఉండే ఈ రహదారిపై ప్రయాణం నిత్యం నరకంగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. రెండు రోజుల పాటు కురిసిన వర్షం వల్ల ఈ పరిస్థితి దాపురించింది. దీంతో అంగన్వాడీ చిన్నారులు, స్కూల్ విద్యార్థులు నిత్యం ఈ రహదారిపై ప్రయాణం చేయాల్సి ఉంది. కాగా నిలువ ఉన్న నీటి వల్ల పేటలో రోగాలు ప్రబలుతున్నాయని పలువురు వాపోతున్నారు.

వర్షాకాలంలో ఇదే తంతు

వర్షాకాలం వచ్చినప్పుడల్లా స్థానికులకు ఈ కష్టాలు తప్పడం లేదు. కనీసం కచ్చా డ్రెయినేజీ వ్యవస్థ కల్పించడంలో అధికారులు అశ్రద్ధ కొరవడింది. ఎన్నికల సమయంలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెందిన ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. కాలనీలో రహదారులు సైతం నీటిలో మునిగిపోవడం వల్ల పాములు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



పేదలందరికీ ఇళ్ల పథకంలో జగనన్న అందరికీ ఇళ్లు కట్టించి ప్రతి ఊరిలోనూ కాలనీలు ఏర్పాటు చేశారు. కాగా నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక అక్కడ సమస్యలను పట్టించుకోవడం లేదు. కాలనీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నాయకులను కోరుతున్నారు.

– దేవరశెట్టి రాంబాబు, కొండేపాడు వైఎస్సార్ సీపీ నాయకుడు

నిధులు కేటాయించాలి



ఎస్సీకాలనీపై కూటమి నాయకులు అశ్రద్ధ చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని కోరుతున్నారు. డ్రెయినేజీలు, చెత్త గ్రామాలలో పేరుకుపోయినా, వర్షంనీరు ముంపు లాగకపోయినా పట్టించుకోవడం లేదు. తక్షణం గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

–గెద్దం అచ్చిబాబు, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి, పెంటపాడు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 విభాగంలో జిల్లాస్థాయిలో ఈనెల 12 నుంచి 15 వరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఎంపికల్లో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలకు చెందిన బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, ఖోఖో, వాలీబాల్, యోగా, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, క్రికెట్, బాస్కెట్ బాల్, హాకీ, అథ్లెటిక్స్ విభాగాల్లో 42 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలిపారు. గురువారం కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి విద్యార్థినులను, శిక్షణ అందించిన పీడీ డి.తారక మహాలక్ష్మిని అభినందించారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో జరిగింది. అసిస్టెంటు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ, డీడీఓ జీవికె మల్లికార్జునరావులు ర్యాలీని ప్రారంభించారు. అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు



హిందూ శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి గురువారం హెడ్ కానిస్టేబుల్ యల్లా శ్రీనివాస్ పట్టణ శివారు (ఎల్.అగ్రహారం రోడ్డులోని) హిందూ శ్మశాన వాటికలో యాగర్లపల్లి శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇతను మృతి చెందాడు. అయితే, మృతుని కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు హెచ్‌సీ తెలిపారు.

డ్రైవర్లను ఆదుకోవాలి



తణుకులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు ప్రతాప్ తదితరులు

తణుకు అర్బన్: డ్రైవర్లను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకం వలన కూటమి నష్టపోతున్న డ్రైవర్లను ప్రభుత్వం ఆర్థికంగా, సంక్షేమంగా ఆదుకోవాలని అన్నారు. ఆటో, మ్యాజిక్స్, బస్సు, కార్ డ్రైవర్లు కిరాయిలు లేక తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది రోజువారీ ఉపాధి కోసం డ్రైవర్లుగా ఉంటే కేవలం 3లక్షలు లోపు వారికి రూ.15 వేలు ఇవ్వడం అన్యాయమని, లైసెన్స్ ఉన్న డ్రైవర్లందరికీ ఇవ్వాలన్నారు. డ్రైవర్లు అందరికి సంవత్సరానికి రూ. 30వేలు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని, అధిక చలానాలు, ఫెనాల్టీలు వేయడానికి తెచ్చిన జీవో 21రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని పెద్దత్తున నినాదాలు చేశారు. అనంతరం తహసిల్దారు డి.అశోక్‌వర్మకు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు అందే శ్రీనివాస్, అమిరుద్దీన్, గార రంగారావు, అంబటి రామకృష్ణ, కె.మారియ్య, సీహెచ్ మోహన్, ఎం.ప్రసాద్, ఎంఎస్‌పి చౌదరి, కనక మోహన్ రావు, కె.బాలాజీ, జి.సాయి తదితరులు ఉన్నారు.

ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



ప్రకాష్‌నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని 29వ వార్డు ప్రకాష్ నగర్ ఎస్‌టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణనాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్ ఎస్టీ కాలనీలో వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని అక్కడి ప్రజలు తాగునీరు, డ్రెయినేజీ, వ్యక్తిగత మరుగుదొడ్డ సమస్యలతో సతమతమవుతున్నారు. అక్కడి సమస్యలు పరిష్కరించాలని గతంలో సీపీఎం చేసిన పోరాటాల ఫలితంగా రెండు పబ్లిక్ ట్యాప్‌లు వేసినా కుళాయిల నుంచి నీరు రావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి సత్వరం సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, సంజీవరావు, దుర్గారావు, మరియమ్మ, యోహాను అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి



రామన్నగూడెం గ్రామంలో దూడలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువులకు సకాలంలో టీకాలు వేయించి, పాల ఉత్పత్తులను పరిరక్షించుకోవాలని రామన్నగూడెం సర్పంచ్ చింతా వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో పాడి పశువులకు నట్టల నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్రావు మాట్లాడుతూ నట్టల నివారణకు ముందస్తు టీకాలు అవసరమన్నారు. లేకుంటే పాడి పశువుల చనిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం 58 దూడలకు నట్టల నివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి టీవీ.విజయ్‌కుమార్, పశువైద్య విద్య కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ రమాదేవి, ఉప సర్పంచ్ పాలడుగుల కృష్ణ, టీడీపీ నాయకుడు మద్దిపాటి ధర్మేంద్ర, నాగరాజు, పశు సంవర్ధక శాఖ సహాయకులు యామిని, పశువైద్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సోలార్ డ్రయర్‌పై 40 శాతం రాయితీ



కొమ్ముగూడెం రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోకో గింజలు ఆరబెట్టడానికి సోలార్ డ్రయర్‌లను 40శాతం సబ్సిడీపై అందిస్తుందని మండల ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని కడియద్ద సచివాలయం, కొమ్ముగూడెం రైతు సేవా కేంద్రం వద్ద ఉద్యాన శాఖ సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, కిసాన్ బాంధవ్ అగ్రి టెక్ ప్రతినిధి రామారావు, మద్దిపాటి సత్యనారాయణ, రమేష్, రైతులు పాల్గొన్నారు.

మద్యం కొనుగోళ్లలో సురక్ష యాప్‌ను వినియోగించండి



తణుకులో మద్యం దుకాణం వద్ద యాప్ వివరాలను వివరిస్తున్న సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: మద్యంపై ప్రజలలో నెలకొన్న అపోహలు, అనుమానాలు తొలగించేందుకు ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ తీసుకువచ్చిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠ రెడ్డి తెలిపారు. తణుకులో మద్యం దుకాణాల వద్ద గురువారం యాప్‌ను ఉపయోగించే విధానాన్ని మద్యం కొనుగోలుదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కొనుగోలు చేసిన మద్యం ఎక్కడ తయారైంది, ఎప్పుడు తయారైంది, దాని బ్యాచ్ నెంబర్ తదితర వివరాలను సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్ మూతపై ఉన్న స్టిక్కర్‌పై గల క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఎక్సైజ్ ఇనస్పెక్టర్ 9440902436 నంబరులో సంప్రదించాలని కోరారు.

అయ్యప్ప దీక్షాధారులకు బిక్ష ప్రారంభం



పడాల అయ్యప్పస్వామి ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల అయ్యప్ప స్వామి ఆలయ సముదాయంలో అయ్యప్ప దీక్షాధారులకు బిక్ష కార్యక్రమాన్ని గురువారం కొవ్వూరి గాంధీరెడ్డి సతీమణి అమ్మాజీ, కుటుంబ సభ్యులు ప్రారంభించారు. తొలుత గోపూజ, అయ్యప్ప స్వామివారికి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి గ్రంధి సత్యనారాయణ, ఇన్‌చార్జ్ అధ్యక్షుడు సూరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నెల రోజుల పాటు గాంధీరెడ్డి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, తదుపరి దాతల సహకారంతో బిక్ష ఏర్పాటు చేస్తామన్నారు. అయ్యప్ప దీక్షాధారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సేవా సమితి పూర్వాధ్యక్షుడు చెరుకువాడ బంగార్రాజు, శానం గోవింద్, కమిటీ సభ్యులు ఆదూరి పెద వెంకటేశ్వరరావు, మొక్కరాల రామచంద్రరావు, కోడూరి విజయ్‌కుమార్, ముత్యాల కృష్ణ, నల్లమిల్లి గాంధీరెడ్డి, నయనాల సూరిబాబు, ఒబిలిశెట్టి నటరాజ్ పాల్గొన్నారు.

18న విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో లైన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా ఈనెల 18వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ డివిజనల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని వేల్పూరు రోడ్డు, రాష్ట్రపతి రోడ్డు, నరేంద్ర సెంటర్, ఉండ్రాజవరం బైపాస్, ఎన్జీవీస్ కాలనీ, మునిసిపల్ కార్యాలయ ప్రాంతంలోను, రూరల్ పరిధిలో పైడిపర్రు, మండపాక, తేతలి, వేల్పూరు, దువ్వ, తేతలి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, అత్తిలి మండలంలో కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం, సీహెచ్‌చెర్వు, కొమ్మర సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోను, ఇరగవరంలో తూర్పువిప్పర్రు, కె కుముదవల్లి, సూరంపూడి, కె.ఇల్లింద్రపర్రు, గోటే రు గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

మద్యం షాపుల్లో విస్తృత తనిఖీలు



మద్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ ఇస్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం: నాణ్యమైన మద్యాన్ని వినియోగదారులకు సరఫరా చేస్తున్నారా లేదా అనే విషయాన్ని వారే నేరుగా ఇక పరీక్షించుకొనే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో దీనిపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నకిలీ మద్యాన్ని సులభంగా గుర్తించవచ్చన్నారు. దీని కోసం గూగుల్ ప్లే స్టోర్ నుంచి సురక్షయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సందేహాల నివృత్తి కోసం 9440902433 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు రసాయన ఎరువులను తగ్గించాలి

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో గురువారం జీవన ఎరువుల వాడకంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి వై రాఘవేంద్ర తెలిపారు. ఈ వారోత్సవల్లో భాగంగా ఉద్యాన పంటల్లో జీవన ఎరువుల వినియోగం, వాటి ఉపయోగాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో కెవీకె ఉండి హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ బిందుప్రవీణా మాట్లాడుతూ రైతులందరూ రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడడాన్ని అలవాటు చేసుకోవాలని, జీవన ఎరువుల వాడడం వలన నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. అనంతరం రైతులు వారి సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఏఐటీయూసీ రాష్ట్ర సమావేశాలు

తాడేపల్లిగూడెం : ఉద్యోగ కార్మిక వర్గ డిమాండ్ల కోసం ఏఐటీయుసీ రాష్ట్ర సమితి కౌన్సిల్ సమావేశాలు శుక్ర, శనివారాల్లో తాడేపల్లిగూడెంలో జరుగనున్నాయని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ గురువారం తెలిపారు. దేశంలో కార్మికోద్యోమం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో వాటి పరిష్కారం కోసం కార్మికవర్గ సాగిస్తున్న పోరాటాలను ఉధృతం చేయడానికి, ఏఐటీయుసీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడానికి ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

లయన్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం: లయన్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవాకార్యక్రమాల్లో స్వచ్ఛభారత్, స్వర్ణ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ డిపో పరిసరాల్లో చెత్త వేసుకొనేందుకు వీలుగా డెస్టుబిన్స్ గురువారం అందజేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. లయన్స్ ప్రతినిధులు చిన్నం మణీంద్ర, త్రిమూర్తి ఆర్థిక సహకారంతో వీటిని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి



ఇరగవరంలో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఇరగవరం: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి సిబ్బంది అధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు, నిర్వహించారు. అనంతరం సీడీపీఓ శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ బాలికలు సమాజంలో గొప్పగా ఎదగాలన్నారు. నేడు అని రంగాల్లో బాలికలు, బాలురులకు దీటుగా పోటీ పడుతున్నారన్నారు. ఆడ పిల్లలను కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆటల పోటల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-1, ఎస్ శ్రీనివాస్, ఎంఇఓ-2 ప్రసాద్, ఎంపీటీసీ మంగిన రామానాయుడు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎండీవీ మాణిక్యాంబ, అరుణకుమారి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.